JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 18-03-2026
Medchal - Malkajgiri । Wednesday 18-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 291
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 291 । Pages : 8 । ₹: 5



## సాహసం చేయడంలో తగ్గేదేలే..!

- **అద్దిరిపోయే అడ్వెంచర్ పార్క్..**


జయభేరి, హైదరాబాద్ :

ఉరుకులు పరుగుల జీవితం, కాంక్రీట్ లైఫ్ కు అలవాటు పడిన హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్. వీకెండ్స్ లో అలా జాలీగా ట్రిప్ కు వెళ్లాలని అనుకుంటున్నారా..? ఇప్పటికే నగరంలోని పర్యటక ప్రాంతాలను కవర్ చేశారా..? అయితే ప్రస్తుతం నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటున్న అడ్వెంచర్ పార్క్ ను ఇప్పుడే సందర్శించండి.. మీరు లైఫ్ లో పొందని అనుభూతిని పొందుతారు. ఫ్రెండ్స్ తో సరదాగా వెళ్లి ఈ అడ్వెంచర్ పార్క్ లో సాహసాన్ని ఆస్వాదించే అవకాశం ఉంది. హైదరాబాద్ అంటే చారిత్రక కోటలు, కట్టడాలు మాత్రమే కాదు ఇప్పుడు అడ్వెంచర్ పార్కులకు కూడా కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. బిజీలైఫ్ కు అలవాటు పడిన నగరవాసులకు వీకెండ్స్ లో గొప్ప రిలీఫ్ ఇచ్చేందుకు ఈ అడ్వెంచర్ పార్కులు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇప్పుడు నగరంలో క్లిఫ్ ఇన్ అడ్వెంచర్స్ పేరు బాగా వినిపిస్తోంది. దాదాపు 500 ఎకరాల్లో ఈ క్లిఫ్ ఇన్ అడ్వెంచర్ పార్కు ఉంటుంది. తుక్కుగూడలోని ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 14,15 వద్ద ఈ అడ్వెంచర్ పార్కు ఉంది. సిటీ నుంచి కేవలం 35 కిలోమీటర్ల దూరంలోనే ఈ పార్కు ఉంది. ఇక్కడ జిప్ లైన్(తెలంగాణలోనే పొడవైన స్కై సైక్లింగ్, ఇంజాపూర్), రాపెల్లింగ్, వాల్ క్లైంబింగ్, కాయాకింగ్, పెడల్ బోటింగ్, జంగిల్ సైక్లింగ్, ఫారెస్ట్ ట్రెక్కింగ్, నేచర్ వాక్స్ తదితర అడ్వెంచర్స్ అందుబాటులో ఉన్నాయి.

...మిగతాది 2 లో

## ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్

- **రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వెంటనే చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా స్పీకర్ తిరస్కరించారు**
- **బీజేపీ ప్రజా ప్రతినిధులు అసెంబ్లీ బయట వినూత్న రీతిలో నిరసన**
- **మార్చి 20న తెలంగాణ బడ్జెట్**



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసనమండలి ఉభయ సభలు తమ కార్యకలాపాలను మొదలుపెట్టాయి. అయితే, మొదటిరోజు షెడ్యూల్‌లో భాగంగా క్వశ్చన్ అవర్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. బీఏసీ (BAC) సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉభయ సభల ముందు ప్రవేశ పెట్టనున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వెంటనే చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా స్పీకర్ తిరస్కరించారు. సభలో ప్రశ్నోత్తరాలను స్పీకర్ రద్దు చేయడంతో కాసేపు గందరగోళం నెలకొంది. బీజేపీ ప్రజా ప్రతినిధులు అసెంబ్లీ బయట వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బషీర్‌బాగ్ నుంచి అసెంబ్లీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన

...మిగతాది 2 లో




## ఆధారాలు ఇవే..
# కేటీఆర్ రాజీనామా చేయాలి

- **మీరు అభయహస్తం నిధులను కాజేశారంటూ మంత్రి సీతక్క ఫైర్**

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలోని మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ. 57,000 కోట్ల రుణాలు ఇచ్చినట్లు రిపోర్టులు చూపిస్తే రాజీనామా చేస్తానన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ పై మంత్రి సీతక్క స్పందించారు. అందుకు సంబంధించిన ఆధారాలు విడుదల చేశారు. కేటీఆర్ ఇచ్చిన సవాల్‌కు కట్టుబడి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాలకు రూ. 57,000 కోట్లు రుణాలు ఇవ్వడమే కాకుండా వడ్డీ భారాన్ని సైతం ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ఇప్పటివరకు రూ. 1,390 కోట్లు వడ్డీ కింద చెల్లించామని మంత్రి సీతక్క తెలిపారు. అంతకుముందు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన కామెంట్స్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన ఆర్డర్ కాపీ చూపెడితే తక్షణమే తాను రాజీనామా చేసి, శాశ్వతంగా బయటికి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. లేదంటే తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు భట్టి రాజీనామా చేస్తారా..? అని అసెంబ్లీ వేదికగా సవాల్ విసిరారు. అయితే కేటీఆర్ సవాల్ పై స్పందించిన మంత్రి సీతక్క అందుకు సంబంధించిన ఆధారాలను వెల్లడించారు. ఈ మేరకు ఆధారాలు చూపిస్తూ.. కేటీఆర్ రాజీనామా

...మిగతాది 2 లో




## రైతుబజార్ కూరలు ఇక ఇంటికే..

- **ఇలా చేస్తే చాలు- అక్కడి ధరలకే అన్ని ఉత్పత్తులు..!!**
- **విశాఖ, గుంటూరు, కాకినాడ, విజయవాడ జిల్లాల్లో ఆన్‌లైన్ రైతుబజార్లకు శ్రీకారం**

జయభేరి, విజయవాడ :

ఇప్పటికే ఈ కామర్స్ ప్లాట్ ఫారాల ద్వారా కూరగాయలు ఇంటికి వస్తున్నాయి. కాగా, కొత్తగా రైతు బజార్ల నుంచి ఇంటికి కూరగాయలు డోర్ డెలివరీ చేయనున్నారు. రైతుబజార్ల ధరలకే డోర్ డెలివరీ చేసేలా కొత్త సదుపాయం కల్పించారు. దీంతో.. కొత్తగా యాప్ ద్వారా రైతుబజార్ వినియోగ దారులకు అందుబాటులోకి వచ్చింది. తొలిగా ఈ విధానం పైలెట్ ప్రాజెక్టుగా విశాఖలో అమలు చేస్తున్న అధికారులు దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నారు. రైతు బజార్ నుంచి కూరగాయలు అక్కడి ధరలకే డోర్ డెలివరీ చేయనున్నారు. అందులో భాగంగా అటు రైతులకు, ఇటు వినియోగదారులకు కూడా లాభం చేకూర్చడానికి ప్రభుత్వ సహకారంతో 'మాచింట్ సొల్యూషన్స్' అనే సంస్థ ముందుకొచ్చింది. రైతు బజార్లను ఈకామర్స్ ప్లాట్‌ఫారంపైకి తీసుకువచ్చింది. బ్లింకిట్, బిగ్ బాస్కెట్ వంటి సంస్థలు ఎలాగైతే ఆన్‌లైన్‌లో కూరగాయలు, పండ్లను ఆర్డర్ తీసుకొని డోర్ డెలివరీ చేస్తున్నాయో అదే విధానంలో రైతుబజార్ల నుంచి తాజా కూరగాయాలు, పండ్లు, ఇతర నిత్యవసరాలు సరఫరా చేయడానికి

...మిగతాది 2 లో

## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడీ..
# కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా?

- **టీపీసీసీ చీఫ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ నేతలకు బహిరంగ సవాల్**
- **పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిపరం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు**

జయభేరి, హైదరాబాద్, మార్చి 17 :



మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ అంశంపై శాసనమండలిలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. డ్రగ్స్ వ్యవహారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. టీపీసీసీ చీఫ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా

...మిగతాది 2 లో



## పాక్ వైమానిక దాడిలో
# 400 మంది మృతి

- **అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి**
- **ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేయలేదు.. ఖండించిన పాక్**

జయభేరి, న్యూ డిల్లీ మార్చ్ 17 :

అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసి పడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియాలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. పాక్ వైమానిక దాడిలో400 మంది మృతి కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున

...మిగతాది 2 లో

## ఇఫ్తార్ విందు హామీ అమలు


- **5,000 మంది ఇమామ్‌లకు ఆరు నెలల వేతనం కింద రూ.30 కోట్ల చెల్లింపులు**
- **5,000 మంది మౌజన్లకు ఆరు నెలల వేతనం కింద రూ.15 కోట్లు ఖాతాల్లోకి జమ**




జయభేరి, విజయవాడ, మార్చి 17 :

ఏపీ సీఎం చంద్రబాబు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. నిన్న విజయవాడలో జరిగిన ఇఫ్తార్ విందులో ప్రకటించిన విధంగా వారి గౌరవ వేతనం బకాయిల కోసం రూ.45 కోట్లను ప్రభుత్వం ఇవాళ విడుదల చేసింది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే నిధులు విడుదల కావడం విశేషం. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 10,000 మంది ఇమామ్‌లు, మౌజన్‌ల ఖాతాల్లోకి గత ఆరు నెలల బకాయిలను నేరుగా జమ చేయనున్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజన్‌లకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా విడుదల చేసిన రూ.45 కోట్లు.. 2025 అక్టోబరు నుంచి 2026 మార్చి వరకు ఆరు నెలల కాలానికి సంబంధించినవి. రాష్ట్రంలోని 5,000 మసీదులలో సేవలందిస్తున్న వారికి ఈ బకాయిలను ఒకేసారి క్లియర్ చేశారు. తమ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇఫ్తార్ విందులో మాట్లాడిన సీఎం, ముస్లిం మైనారిటీల అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. అమరావతిలో కొత్తగా హజ్ హౌస్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. అలాగే, కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్‌ను త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 21 నెలల్లో ముస్లింల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం కింద రూ.180 కోట్లు అందించామని వివరించారు.

...మిగతాది 2 లో



## సినీ ఫక్కీలో కోటి రూపాయలు చోరీ

- **హవాలా సొమ్ముగా అనుమానం.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు**
- **నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలు**

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో షాకింగ్ సంఘటన చోటు చేసుకుంది. స్కూటీపై వెళ్తున్న ఇద్దరి

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## కేటీఆర్ రాజీనామా చేయాలి

చేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. కేటీఆర్ తన మాటకు కట్టుబడి రాజీనామా చేయాలని అన్నారు. మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్ల బ్యాంకింగ్ రుణాలు ఇస్తే రాజీనామా చేస్తా అన్నారు .. ఇదిగో ఆధారాలు అంటూ వెల్లడించారు. మహిళా సంఘాల వడ్డీ భారాన్ని కూడా భరిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటి వరకు రూ. 1,390 కోట్ల వడ్డీలను చెల్లించినట్లు ఆధారాలు వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 4 వేల కోట్ల వడ్డీలను మహిళా సంఘాలకు ఎగ్గొట్టారని మండిపడ్డారు. మీరు అభయహస్తం నిధులను కాజేశారంటూ మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. ఈ మేరకు తక్షణమే కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా?

డ్రగ్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రకటించారు. తొలి డ్రగ్స్ టెస్ట్ సీఎం రేవంత్ రెడ్డి చేయించుకుంటారని మహేష్ గౌడ్ అన్నారు. 'తెలంగాణ ప్రజలకు ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిపరం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది. డ్రగ్స్ కు మేం వ్యతిరేకంగా అని చెప్పేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్ టెస్ట్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా కూడా డ్రగ్స్ పరీక్షలకు వస్తారు. మరి బీఆర్ఎస్ నేతలు డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా? బీఆర్ఎస్ సభ్యులు తమ నాయకులైన ప్రతిపక్షనేత కేసీఆర్, కేటీఆర్‌లను కూడా డ్రగ్ టెస్టుకు తీసుకురాగలరా' అని మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు.డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, తప్పు చేయని వారు భయపడాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసును అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్న బీఆర్ఎస్ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. నేరస్తులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో శాసనమండలి దద్దరిల్లింది. రాజకీయ నేతల మధ్య మొదలైన ఈ 'డ్రగ్ టెస్ట్' వార్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ డ్రగ్స్ టెస్టుకు ఎవరు వస్తారో, ఎవరు డుమ్మా కొడతారని తెలంగాణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్టానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని, ఈ కేసుకు సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నివేదిక సంతృప్తికరంగా లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, తుది నిర్ణయం వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. రాజకీయ వర్గాల్లో ఈ నిర్ణయం సంచలనం సృష్టిస్తోంది.

## ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్

దరఖాస్తులను తోపుడు బండిపై ఉంచి అమరవీరుల స్థూపం వరకు తీసుకెళ్లి.. ప్రభుత్వం రైతుల పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. బీజేపీ నేతలు రైతుల దరఖాస్తులతో సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని అడ్డుకున్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక వార్షిక నివేదికలను సభా సమక్షంలో ఉంచనుంది. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సమాచార కమిషన్ వార్షిక నివేదికలను సభకు సమర్పించనుండగా, మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ వాణిజ్య ప్రోత్సాహక సంస్థ లిమిటెడ్ (8వ నివేదిక), తెలంగాణ రాష్ట్ర చర్మ పరిశ్రమ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (4వ నివేదిక) నివేదికలను ప్రవేశపెట్టనున్నారు.

ఈ నివేదికలపై సభలో చర్చ జరిగే అవకాశం ఉంది. సమావేశాల ప్రధాన అంశంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ నేడు, రేపు చర్చ జరగనుంది. శాసనసభలో ఎమ్మెల్యే బాలు నాయక్ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దానిని బలపరుస్తారు. అదేవిధంగా, శాసనమండలిలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ బలపరుస్తారు. ఉభయ సభల్లోనూ గవర్నర్ ప్రసంగంపై సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. మార్చి. 19న ఉగాది సందర్భంగా అసెంబ్లీకి సెలవు. మార్చి 20న తెలంగాణ బడ్జెట్‌ను ఉభయ సభలలో ప్రవేశపెడతారు. మార్చి 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా సెషన్‌కు విరామం ప్రకటించారు. మార్చి 23 నుంచి రాష్ట్ర బడ్జెట్‌పై ఉభయ సభలలో చర్చ జరుగుతుంది. మార్చి 26న శ్రీరామనవమి, 29న ఆదివారం నాడు విరామం ఇచ్చారు. మార్చి 30న ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ జరిపిన తరువాత రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీ ఆమోదిస్తుంది. ఈ సెషన్లో ఒకరోజు ఉభయసభల్లోనూ మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వ నిర్ణయాలు, ప్రతిపక్షాల ప్రశ్నలు లేవనెత్తుతూ చర్చ జరగనుంది. రాష్ట్ర బడ్జెట్‌పై చర్చలకు ఈ సమయం సరిపోదని, మరికొన్ని రోజులు సభ నిర్వహించాలని బీఆర్ఎస్ కోరింది. ఆదివారాలు అయినప్పటికీ మార్చి 22, 29 తేదీల్లో సభను నిర్వహించాలని, అదే విధంగా మార్చి 31 వరకు సమావేశాలను కొనసాగించాలని బీఆర్ఎస్ నేతలు కోరారు.

**బీజేపీ వినూత్న నిరసన**

ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్ నాయకత్వంలో, వారి మద్దతుదారులతో కలిసి అసెంబ్లీ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం నుంచి నిరసన ప్రారంభించారు. ఫసల్ బీమాను అమలు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రైతుల వినతులను ప్రభుత్వానికి అందజేసి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని వారు తెలిపారు. అయితే, అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. తోపుడు బండిని లోపలికి అనుమతించబోమని స్పష్టం చేశారు. వినతిపత్రాలను తమకు అందజేస్తే, సంబంధిత అధికారులకు చేరవేస్తామని భద్రతా సిబ్బంది హామీ ఇచ్చారు.. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలని, రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయాలని, రైతు భరోసా నిధుల విడుదలలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి బడ్జెట్‌లో ఫసల్ బీమా అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం విఫలమైందని వారు ఆరోపించారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ పంటల బీమా పథకం కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రైతులను మోసం చేసిందని ఎమ్మెల్యే హరీశ్ అన్నారు. రైతు భరోసా పథకం కింద కూడా రైతులకు ఆర్థిక సాయం అందడం లేదని, తగిన సమయంలో ప్రభుత్వంపై రైతులు తమ ఆగ్రహాన్ని చూపిస్తారని హెచ్చరించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. రైతులు తమ సమస్యలను వివరిస్తూ ఇచ్చిన వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందజేయాలనే ఉద్దేశంతోనే ఇక్కడికి వచ్చామని మరో ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.

## 400 మంది మృతి

మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఫ్గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఫ్గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు.

**ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేయలేదు.. ఖండించిన పాక్**

కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఫ్ఘనిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

# పెట్రోల్, డీజిల్, ఎరువులపై యుద్ధ ప్రభావం

యుద్ధాల్లో స్పష్టమైన విజేతలు ఉండటం చాలా అరుదు. సామాన్య ప్రజలే తరచూ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది.ప్రపంచ ఇంధన మార్కెట్లు, సరఫరా గొలుసులు అస్తవ్యస్థంగా మారడంతో, కొన్ని దేశాలు తీవ్ర ఆర్థిక పర్యవసనాలను ఎదుర్కోవాల్సి వస్తోంది.అయితే ఇంతటి అనిశ్చితిలోనూ కొన్ని దేశాలు సరికొత్త వ్యూహాత్మక అవకాశాల కోసం చూస్తున్నాయి.ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆ ప్రాంతంలో ప్రతికూల పరిణామాలను కలిగిస్తోంది.గల్ఫ్ దేశాలను అస్థిరపరిచింది. మధ్య ప్రాచ్యంలోని వేలాది మంది ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తమ ఇళ్లను విడిచి బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. చమురు ధరల పెరుగుదల, గల్ఫ్‌లో హార్ముజ్ జలసంధి వద్ద సముద్ర రవాణాకు కలుగుతున్న అంతరాయం వ్యాపారులకు, వినియోగదారులకు మరింత ఖర్చును పెంచుతోంది.ఇరాన్ రష్యాకు కీలకమైన మిత్రదేశం. అత్యంత ముఖ్యమైన సైనిక భాగస్వామి. సిరియాలో బషర్ అల్‌అసద్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడం, వెనెజ్వెలాలో నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన తర్వాత.. మాస్కోకు దౌత్యపరంగా ఎదురైన మరో ఎదురు దెబ్బ ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో మరణించడం. అయితే, మధ్య ప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభం యుక్రెయిన్‌తో రష్యా తలపడుతోన్న యుద్ధానికి ప్రయోజనకరంగా మారవచ్చు. ఎందుకంటే, అమెరికా తన సైనిక బలగాలను మధ్య ప్రాచ్య సంక్షోభం వైపు మళ్లించవచ్చు.'' పేట్రియాట్ క్షిపణులు, ఇంటర్‌సెప్టార్లు తగ్గిపోవడం రష్యాకు ప్రయోజనకరంగా మారుతుంది. దీనివల్ల యుక్రెయిన్‌కు అందే ఆయుధాల సంఖ్య తగ్గిపోతుంది'' అని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌కు చెందిన పారిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ స్టడీస్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ నికోల్ గ్రాజేవ్‌స్కీ పర్షియన్‌కు చెప్పారు.తెహ్రాన్‌కు షాహెద్ డ్రోన్ల అవసరం పెరిగినందువల్ల యుక్రెయిన్‌లో మాస్కో సామర్థ్యాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపకపోవచ్చని నిపుణులు అంటున్నారు.''యుక్రెయిన్‌తో యుద్ధం మొదలైనప్పుడు ఒక నిర్దిష్ట కాలం పాటు రక్షణ సహకారాల్లో భాగంగా రష్యా ఇరాన్‌పై ఆధారపడింది. అప్పుడు ఇరాన్ షాహెద్ డ్రోన్లను అందించింది. ముఖ్యంగా 202223లో వీటి ప్రొడక్షన్ టెక్నాలజీని, ఈ డ్రోన్ల లైసెన్స్‌లను రష్యాకు అందించింది''



అని అమెరికాలోని సెంటర్ ఫర్ నాన్‌ప్రొలిఫరేషన్ స్టడీస్‌కు చెందిన యురేసియా డైరెక్టర్ హన్నా నోట్ తెలిపారు.'ఇప్పుడు యుక్రెయిన్‌లో యుద్ధం కొనసాగించడానికి రష్యాకు ఇరాన్ మద్దతు అవసరం లేని దశలో ఉంది. రష్యా సొంతంగా షాహెద్ డ్రోన్లను ఉత్పత్తి చేసుకోగలదు'' అని తెలిపారు.ఇదే సమయంలో చమురు, గ్యాస్ సరఫరాలకు అత్యంత కీలక మార్గమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో చమురు ధరలు పెరిగాయి. ఇది యుక్రెయిన్ యుద్ధంతో తీవ్ర ఒత్తిడికి గురైన రష్యాకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తుంది. రష్యా బడ్జెట్ ఎక్కువగా ఆ దేశ చమురు ఎగుమతులపైనే ఆధారపడింది.

అప్పట్లో బ్యారల్ చమురు ధర 59 డాలర్లు ఉండేది. ప్రస్తుతం ముడి చమురు ధర గణనీయంగా పెరిగింది. ఒకానొక సమయంలో బ్యారల్ సుమారు 120 డాలర్లకు ఎగిసింది.గల్ఫ్‌లోని ప్రముఖ చమురు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గించడంతో.. ప్రస్తుతం చైనా, భారత్ వంటి ముఖ్యమైన మార్కెట్లకు రష్యా మరింత ఎక్కువగా ఎగుమతి చేసే అవకాశం ఉంది.''గతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకుండా అమెరికా భారత్‌ను అడ్డుకుంది. కానీ, ప్రస్తుతం సంక్షోభంతో భారత్‌కు కాస్త ఉపశమనాన్ని కల్పిస్తూ.. మళ్లీ రష్యా చమురు కొనుగోలుకు అనుమతిచ్చింది. కనీసం వచ్చే నెల వరకు ఈ కొనుగోళ్లు కొనసాగవచ్చు ' అని గ్లోబల్ ఎనర్జీ, కమోడిటీ మార్కెట్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఆర్గస్ చీఫ్ ఎకనామిస్ట్ డేవిడ్ ఫైఫే చెప్పారు.ఈ సమస్యల నుంచి కొంత బయటపడేందుకు రష్యా చమురుపై ఆంక్షలను సడలించాలని ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి.ఇరాన్ యుద్ధం వల్ల చైనాపై పడే ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా చూడాల్సి ఉంది.చైనా ముడిచమురు దిగుమతుల్లో కేవలం 12 శాతం మాత్రమే ఇరాన్ నుంచి వస్తుందని సెంటర్ ఆన్ గ్లోబల్ ఎనర్జీ పాలసీ తెలిపింది.పైగా, చైనాలో కొన్ని నెలలకు సరిపడా చమురు సరఫరాలున్నాయి. ఆ తర్వాత తేలికగా రష్యా సాయాన్ని కూడా చైనా కోరుతుండొచ్చు.అయితే యుద్ధం వల్ల, చైనా ''ఎగుమతుల ఆధారిత పరిశ్రమల రంగం'' ప్రభావితం చెందవచ్చని ఫైఫే తెలిపారు.ప్రాపర్టీ ధరలు పడిపోవడం, దేశీయ వ్యయం తగ్గిపోవడంతో సతమతమవుతున్న చైనా ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా పనిచేసేది, ఆ దేశ జీడీపీలో 20శాతం వాటా ఉన్న ఎగుమతులే.హార్ముజ్ జలసంధిలో సముద్ర రవాణాకు నెలకొన్న అంతరాయం చైనాకు అంత పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ, చైనా ఉత్పత్తులు పశ్చిమానికి వెళ్లేందుకు అట్లాంటిక్ చేరుకోవడం క్లిష్టంగా మారవచ్చు.

మరోవైపు, ఆసియా, యూరప్, ఆఫ్రికాలను కలిపే అరేబియన్ ద్వీపకల్పంలోని బాబ్ ఎల్‌మాండెబ్ జలసంధిలో కూడా ఇరాన్ అండదండలున్న హౌతీలు దాడులు చేస్తున్నారు.'' ఇరాన్‌పై యుద్ధంలో చైనాకు దౌత్య అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అమెరికాకు సమతూకంగా తనను తాను నిలబెట్టుకునేందుకు ఇది ప్రయత్నిస్తుంది'' అని యూకే రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఫిలిప్ షెట్లర్ జోన్స్ చెప్పారు.మధ్య ప్రాచ్యంలోని చమురు, గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడ్డ ఆగ్నేయాసియా దేశాలు ఈ యుద్ధంతో ఎక్కువగా ప్రభావితమవుతాయి.కొన్ని ఇప్పటికే కఠినమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించాయి. వీలైనంత త్వరగా ఆర్థిక ప్రభావాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నాయి.వియత్నాంలో ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి డీజిల్ ధర 60 శాతం పెరిగింది. వీలైతే ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచే పనిచేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది.మధ్య ప్రాచ్యం నుంచి ముడిచమురు దిగుమతులపైనే 95 శాతం ఆధారపడ్డ ఫిలిప్పీన్స్‌లో ఎమర్జెన్సీ సేవల్లో పనిచేసే వారు మినహాయించి ప్రభుత్వ రంగ ఉద్యోగులు ప్రస్తుతం వారానికి నాలుగు రోజులే పనిచేస్తున్నారు.పాకిస్తాన్‌లో కూడా ఇదే రకమైన ఆంక్షలను ప్రవేశ పెట్టారు. వీలైనప్పుడల్లా వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలను జారీ చేస్తున్నారు. యూనివర్సిటీ తరగతులన్నీ ఆన్‌లైన్‌లోకి మారాయి.యుద్ధభయంతో భారీ కొనుగోళ్ల కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇబ్బంది పడుతోంది. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. దీంతో, కార్లకు రోజుకు 10 లీటర్లు, మోటార్‌సైకిళ్లకు కేవలం రెండు లీటర్లు మాత్రమే ఇచ్చేలా పలు నిర్ణయాలను ప్రకటించింది.కానీ, యుద్ధం పర్యవసనాలు ఇంధన కొరతలకు మించి ఉండనున్నాయి.ప్రపంచవ్యాప్తంగా రైతులు తమ పంటల కోసం ఎరువులపై ఆధారపడ్డారు. ఈ ఎరువుల రవాణాలో అంతరాయాలు ఏర్పడితే, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతకు ప్రమాదం వాటిల్లనుంది.'' ప్రపంచ యూరియాలో 30 శాతం హార్ముజ్ జలసంధి మీదుగానే వస్తుంది. పెట్రో కెమికల్స్ నుంచి యూరియా వస్తుంది. ముడి చమురును శుద్ధి చేయడం ద్వారా పెట్రోకెమికల్స్ తయారవుతుంది. ప్రపంచ మార్కెట్ల నుంచి 30 శాతం యూరియాను తీసివేస్తే, ప్రపంచ ఆహార భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపనుంది'' థింక్ ట్యాంక్ చాథమ్ హౌస్ మిడిల్ ఈస్ట్ నిపుణులు నీల్ క్విలియం తెలిపారు

.ప్రపంచంలో అతిపెద్ద గ్యాస్ ఎగుమతిదారుల్లో ఒకటైన, ఎరువుల కోసం యూరియాను ఉత్పత్తి చేసే ప్రధాన సంస్థల్లో ఒకటి ఖతార్ ఇంధన స్థావరాలపై దాడులు జరిగాయి. ఈ దాడులతో కంపెనీలు తమ ఉత్పత్తి, డెలివరీలను తాత్కాలికంగా నిలిపివేసేలా అత్యవసర చర్యలను ప్రకటించాల్సి వచ్చింది.''ఆహార భద్రత , ద్రవ్యోల్బణంపై ప్రభావాన్ని మీరు చూడొచ్చు'' అని క్విలియం తెలిపారు.''ఈ ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా లెక్కించలేదు. కానీ, పంటలకు ఇబ్బందులు ఎదురైతే, ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడితే మనం దీర్ఘకాలిక ప్రభావాన్ని చూడాల్సి రావచ్చు'' అన్నారు.



## మా పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చింది

■ జాగృతి అధినేత కవిత

జయభేరి, హైదరాబాద్ :

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో 750 మంది పేదల ఇండ్లను కూలగొట్టిన అరాచక కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు డా. విశారధన్ మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంయుక్త పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చిందని జాగృతి అధినేత కవిత అన్నారు. ఇండ్లు కూల్చేసిన వారిలో 411 మందికి పట్టాలు ఇస్తామని ప్రకటించింది.. ప్రజా పోరాటాలు తప్పక విజయం సాధిస్తాయనే విషయం నిరూపితమైంది. 750 మంది ఇండ్లు కూల్చివేసి కేవలం 411 మందికి మాత్రమే పట్టాలు ఇవ్వడంతో మిగతా బాధితుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తమకు అన్యాయం జరిగిందనే భావన వారిలో నెలకొన్నదని అన్నారు. పట్టాల పంపిణీలో పారదర్శకత ఉండాలని, ప్రతి బాధితుడికి న్యాయం జరగాలనే లక్ష్యంగా వెలుగుమట్ల బాధితుల కోసం నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశాము. రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలోని నిజ నిర్ధారణ కమిటీలో ఆర్మీ మాజీ అధికారి, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు భాగస్వాములు కావడం సంతోషంగా ఉంది. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ కమిటీ ప్రభుత్వం వెంటబడుతుంది. నిజ నిర్ధారణ కమిటీకి ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు సంపూర్ణంగా సహకరించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. .

## ఇఫ్తార్ విందు హామీ అమలు

రాష్ట్రంలో అర్హులైన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించడంతో పాటు వివాహ లైసెన్స్ గడువును 3 సంవత్సరాల నుంచి 10 ఏళ్లకు పెంచామని చంద్రబాబు తెలిపారు. సుమారు 1,500 వక్ఫ్ ఆస్తులను సర్వే చేసి వాటిని కాపాడుతున్నామని చెప్పారు. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మంది ఇమామ్‌లు, మౌజన్‌ల ఖాతాల్లోకి నేరుగా నగదును అధికారులు జమ చేయనున్నారు.

## రైతుబజార్ కూరలు ఇక ఇంటికే..

మాచింట్ సొల్యూషన్స్ https://digirythubazaarap.com/ అనే వెబ్‌సైట్, యాప్ రూపొందించింది. ఆ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే ఆరోజు రైతు బజార్లలో అందుబాటులో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు, వాటి ధరలు కనిపిస్తాయి. దశల వారీగా విస్తరణ ఈ యాప్ ద్వారా వినియోగదారుల ఇళ్లకే కూరగాయలు, నిత్యావసరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే విశాఖ, గుంటూరు, కాకినాడ జిల్లాల్లో ఆన్‌లైన్ రైతుబజార్లకు శ్రీకారం చుట్టగా, తాజాగా విజయవాడలోనూ యాప్ ద్వారా కార్యకలాపాలు ప్రారంభించారు. అందరికీ డీజీ రైతుబజార్ యాప్ వినియోగంపై అధికారులు ప్రచారం కల్పిస్తున్నారు.

గూగుల్ ప్లే స్టోర్ నుంచి డీజీఆర్‌బీ యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్, చిరునామా వంటివి నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత దగ్గర్లోని రైతుబజార్‌కు ఆర్డర్ చేస్తే నేరుగా కూరగాయలు ఇంటికే రానున్నాయి. కూర గాయలు, ఆకుకూరలు, కొన్ని నిత్యావసర వస్తువులు సైతం ఇంటి వద్దకే అందుతాయి. కనీసం వంద రూపాయలలోపు ఆర్డర్ చేస్తే హ్యాండ్లింగ్ ఛార్జీలు, జీఎస్టీ కలిపి రూ. 49 వరకు ఛార్జీలు వసూలు చేస్తారు. నిర్వహణలో వినియోగదారుల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా మార్పులు చేర్పులు చేసి.. రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలుకు కసరత్తు జరుగుతోంది.

## సాహసం చేయడంలో తగ్గేదేలే..!

అలాగే గేమ్స్ లో ఆర్చెరీ, వాలీబాల్, రోప్ కోర్సులు, కాంప్ ఫైర్ విత్ మ్యూజిక్, అవుట్ డోర్ స్క్రీనింగ్స్ అందుబాటులో ఉన్నాయి. క్లిఫ్ ఇన్ అడ్వెంచర్ పార్కు ఫీజు వివరాలు చూస్తే రూ. 799 నుంచి ప్రారంభం అవుతుంది. టైమింగ్స్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది.

నైట్ కాంపింగ్ సమయాలు సాయంత్రం 4 గంటల నుంచి తెల్లవారు జామున ఉదయం 11 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. వీటి ధరలు రూ. 1,700 నుంచి రూ. 1,999 గా ఉంటుంది. ఈ పార్కుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం CliffInn Adventures అధికారిక వెబ్ సైట్ లేదా 95731 99863 నంబర్ కు సంప్రదించవచ్చు. ఇంకెందుకు మీరు కూడా క్లిఫ్ ఇన్ అడ్వెంచర్ పార్కులో సాహసం చేయండి.

## సినీ ఫక్కీలో కోటి రూపాయలు చోరీ

కళ్ళలో కారం కొట్టి కోటి రూపాయల నగదును దోచుకెళ్ళిన ఘటన సోమవారం రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో జరిగింది. కూకట్‌పల్లి పిల్లర్ నెంబర్ 825 సమీపంలో, ఏసీపీ కార్యాలయం పక్కనే ఈ ఘటన చోటుచేసుకోవటం అందర్నీ షాక్ కు గురి చేసింది. సినీ ఫక్కీలో కోటి రూపాయల భారీ దోపిడీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బహదూర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్‌లు మహ్మద్ ఖుస్రూ , మహ్మద్ అజీముద్దీన్ కోటి రూపాయల నగదును తరలిస్తున్న క్రమంలో ఈ భారీ దోపిడీ జరిగింది. మహ్మద్ ఖుస్రూ , మహ్మద్ అజీముద్దీన్ ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు గోల్డ్ డ్రాప్ కార్టన్ బాక్స్‌లో కోటి రూపాయలను పెట్టుకుని తరలించే ప్రయత్నం చేశారు. వీరు కూకట్‌పల్లి పిల్లర్ నెంబర్ 825వద్ద ఏజెంట్ల నుంచి డబ్బులు సేకరించారు.

**దోపిడీ జరిగిందిలా..**

అయితే, వీరిని ముందుగానే గమనించిన నలుగురు దుండగులు మూడు బైక్‌లపై వెంబడించి, నగదు తీసుకున్న కేవలం 100 మీటర్ల దూరం వెళ్లగానే, దుండగులు వారి కళ్ళలో కారం పొడి చల్లి దాడి చేశారు. దీంతో బాధితులు కిందపడిపోయారు.వెంటనే నగదు ఉన్న బాక్స్‌ను లాక్కుని దుండగులు పరారయ్యారు. దోపిడీకి ప్యాషన్ ప్లస్, ఎఫ్‌జెడ్ మోడల్ బైక్‌లను వాడినట్లు పోలీసులు గుర్తించారు.

**హవాలా సొమ్ముగా అనుమానం.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ఈ దోపిడీ సొమ్ము హవాలాకు సంబంధించినది అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. దోపిడీకి పాల్పడిన వారు లోపలి వ్యక్తుల సమాచారం మేరకే దోపిడీ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసులు ఈ కేసును అనేక కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు..ప్రస్తుతం పోలీసులు బాధితులను అదుపులోకి తీసుకుని, ఈ డబ్బు ఎక్కడ నుండి వచ్చింది? ఎవరికి సంబంధించినది? ఎక్కడకు తీసుకు వెళ్తున్నారు? అంటూ అన్ని వివరాల కూపీ లాగే పనిలో పడ్డారు.

**నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలు**

నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటన జనం తిరుగుతున్న సమయంలోనే జరగగా, నగర భద్రతా వ్యవస్థపై ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ ఘటన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ప్రజా ప్రతినిధులు భావితరానికి ఆదర్శంగా నిలవాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- కొత్తకోటలో సర్వసభ్య సమావేశం

**జయభేరి, దేవరకద్ర :**




ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సూచించారు. అప్పుడే వారి పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. కొత్తకోట మున్సిపల్ కార్యాలయం లో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో కలసి జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, ట్రాఫిక్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు, సీసీ రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.మున్సిపల్ ఎన్నికల తరువాత ఈ మొదటి జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో నూతనంగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల ఆశీర్వాదం, దీవెనలతో గెలిచినా మీరు మంచి పనులు, ప్రజలకు సేవ చెస్తే.. అంతకన్నా మరొకటి లేదన్నారు.నిబద్ధత, క్రమశిక్షణ తో పని చేయాలి. భవిష్యత్తు తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు.ఎన్నికల సమయంలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజల ఇబ్బందులు తీర్చడానికి నిరంతరం కృషి చేయండి, నా వంతు పూర్తి సహకారం అందజేస్తా, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

కొత్తకోట మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి ఇటీవలే రూ.17 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. కొత్తకోట మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి, నిన్న అసెంబ్లీలో ముఖ్యమంత్రి తో చర్చించడం జరిగింది, నిధులు కేటాయించడానికి ముఖ్యమంత్రి సానుకూలత వ్యక్తం చేశారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, నీటి సమస్యలు తలెత్తకుండా, అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది, దాని కోసం ఎన్ని నిధులైన ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రూ.6 కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, రూ.2 కోట్ల రూపాయల నిధులతో పార్కుల డెవలప్మెంట్ కు నిధులు కేటాయించామన్నారు. రూ.1 కోటి, 50 లక్షల నిధులతో స్ట్రోమ్ వాటర్, డ్రైన్ల నిర్మాణానికి, రూ.5 కోట్ల నిధులతో చేనగ చెరువు కట్ట పై, వెంకటగిరి రహదారిపై సంత బజార్ ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి బ్యూటీఫికేషన్ పనులు చేపడతామన్నారు. డివైడర్ పై కోనో కార్పస్ మొక్కలను తొలగించి, బ్యూటీఫికేషన్ పనులు చేపడతామన్నారు. విద్యుత్ లైన్ల కు సంబంధించి, ఐరన్ పోల్స్ పూర్తిగా తీసివేసి, కొత్త పోల్స్ త్వరలో వేస్తామన్నారు. కొత్తకోట మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదు, కొత్తకోట మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తీరుతామని ఎమ్మెల్యే జిఎంఆర్ హామీ ఇచ్చారు.

# ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకాలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహస్వామి వారి ఆలయంలో కొలువైన శ్రీఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మంగళవారం ఆంజనేయుడిని సింధూరంతో అలంకరించి స్వామి వారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**నిత్యపూజలు..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా మంగళవారం రూ.27,74,928 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,48,790, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,00,500, వీఐపీ దర్శనం ద్వారా రూ.2,10,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.1,96,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.47,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.8,70,770, కల్యాణకట్ట ద్వారా రూ.80,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



# ఉత్సవాల పేరుతో ఎన్టీపీసీ సిఎస్ఆర్ నిధుల దుర్వినియోగం

- ఉత్సవ కమిటీ పెద్దలు పై ఆరోపణలు

**జయభేరి, పరవాడ:**

ఉత్సవాల పేరుతో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధుల వినియోగంపై పరవాడ మండలం వాడ చీపురుపల్లి గ్రామంలో వివాదం నెలకొంది. ఇటీవల జరిగిన రామచంద్రమ్మ అమ్మవారి జాతర సందర్భంగా క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం విడుదలైన నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ గ్రామంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై స్థానిక గ్రామ నాయకుడు మాసవరపు అప్పారావు మాట్లాడుతూ వాడచీపురుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థన మేరకు ఉత్సవ కమిటీకి అందిన నిధులను గ్రామ ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయకుండా వినియోగించారని ఆరోపించారు. నిధుల ఖర్చు వివరాల్లో పారదర్శకత లేదని,ఉత్సవ కమిటీ పెద్దలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఆర్టీఐ ద్వారా బయటపడిన వివరాల ప్రకారం, క్రీడలు, కళలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఎన్టీపిసి సిఎస్ఆర్ సంస్థ అందించిన నిధులు 202223 ఆర్థిక సంవత్సరానికి రూ.5.30 లక్షలు, 202324కి రూ.8.77 లక్షలు, 202425కి రూ.3.5 లక్షలు విడుదలైనట్లు తెలిపారు అయితే ఈ నిధులు గ్రామపంచాయతీకి నేరుగా రాలేదని, స్థానిక ఉత్సవాల సందర్భంగా సర్పంచ్ అభ్యర్థన మేరకు రామచంద్రమ్మ ఉత్సవ కమిటీ"కి ఆర్థిక సహాయం అందించినట్లు ఎన్టీపీసీ సింహాద్రి అధికారులు స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని ఖర్చు వివరాలను బహిర్గతం చేసి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు గ్రామస్థులు సిద్ధమవుతున్నట్లు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

# ఫార్మా వ్యర్థాలను దగ్గం చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి

- సిఐటియురాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలంలో పెదతాడి గ్రామాన్ని ఆనుకొని సర్వే నెంబర్ 116 కొండ ప్రాంతంలో లోవ దగ్గర ఫార్మా వ్యర్థాలను రాత్రి సమయంలో తీసుకొచ్చి దగ్ధం చేస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఫార్మా ఘన వ్యర్థాలను మండిస్తున్న సర్వే నెంబర్ 116 ప్రాంతాన్ని ఆయన తాడి గ్రామస్తులతో కలిసి పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం చెక్పోస్టులు సక్రమంగా నిర్వహించకపోవడం వలన ఫార్మా యాజమాన్యాలు ఘన వ్యర్థాలను ఈ విధంగా బహిరంగ ప్రదేశాల్లో మండిస్తున్నారని దీనివల్ల తీవ్రమైన కాలుష్యం ఏర్పడుతుందని, ప్రజలు జీవించడమే కష్టంగా మారుతుందని ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని నిమ్మకనీరుతున్నట్లు ఎవరు ఇస్తున్నారని గనిశెట్టి విమర్శించారు. ప్రభుత్వం యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి వ్యర్థాలను మండిస్తున్న యజమానులతో పాటు రాంకీ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాంకీ యాజమాన్యం ఘన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో రాకుండా చూసే బాధ్యత తను గాలికొదిలేసిందని అన్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేపడతామని గని శెట్టి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తాడి గ్రామ నాయకులు కోమటి అచ్చిబాబు, శీలం. సూరిబాబు, సాలాపు రమణ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి దోపిడి కేసు దర్యాప్తు ముమ్మరం

**జయభేరి, కూకట్ పల్లి :**

అజీముద్దీన్, కుస్రుఫ్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కూకట్పల్లి మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబర్ 836 వద్ద నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి, వారిపై కారం చల్లి కోటి రూపాయల నగదును ఎత్తుకెళ్లినట్లు ఎసీపీ నరేష్ రెడ్డి తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఇన్స్పెక్టర్ సుబ్బారావు తన బృందంతో దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, సీసీటీవీ కెమెరాల ఆధారంగా విచారణ కొనసాగిస్తున్నామని, డబ్బు యాక్కడ నుంచి వచ్చాయి ఎక్కడికి వెళ్తున్నాయి అనే కోణంలో కూడా దర్యాప్తు ముమ్మరం చేసినట్లు నరేష్ రెడ్డి వెల్లడించారు. ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. భారీ మొత్తంలో నగదు పట్టుగొడడంపై ఆరా, ఐటి విభాగం అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసారు..

# ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న వైద్యులు

**జయభేరి, యాదగిరిగుట్ట:**



ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలపై యాదగిరిగుట్ట పీహెచ్సీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జిల్లా ఇమినైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. యాదగిరిగుట్ట, శారాజీపేట, రాజాపేట పరిధిలోని ఐదేళ్లలోపు చిన్నారులు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై అవసరమయ్యే పరీక్షలన్నీ సకాలంలో నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో యాదగిరిగుట్ట, శారాజీపేట, రాజాపేటవైద్యులు, సూపర్వైజర్లు, అశా వర్కర్లు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ ను ముట్టడించిన అశ వర్కర్లు

**జయభేరి, మేడ్చల్ :**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా సమస్యలు ఎందుకు పరిష్కారం చేయడం లేదని,గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు కార్మికులకు కష్టజీవులకు ఫిక్సిడ్ వేతనాలు 18వేల రూపాయలు ఇవ్వాలని పోరాటాలు చేస్తుంటే మొద్దు నిద్రలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ఆశలకు ఫిక్సిడ్ వేతనాలు, ఇన్స్ రైన్స్, ఇఎస్ఐ, పీఎఫ్ లు ఇవ్వాలని దీనిపై చర్చ చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వంని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు.వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదలు చేస్తూ కలెక్టర్ కార్యలయం లోనికి వెళ్లే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తం చోటుచేసుకుంది, పోలీసులు ఆశ వర్కర్లను,సీఐటీయూ నాయకులను అరెస్టు చేసి బొల్లారం,జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఇఫ్తార్ విందు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం ఉపవాస దీక్షలున్న ముస్లిం సోదరులకు స్థానిక మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగేంధర్ రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక జామె మజీద్ ఆవరణలో జరిగిన ఈ ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులకు యుగంధర్ రెడ్డి ఖర్జూర పండ్లు తినిపించి దీక్షలను విరమింప చేశారు. అలాగే ఇఫ్తార్ విందుకు హాజరైన నాయకులతో పాటు ముస్లిం సోదరులకు యుగేంధర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం జరీనా బేగం, అబ్దుల్ నయీమ్ ల ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల ప్రారంభించిన అయ్యప్ప డిజిటల్స్ షాప్ ని సందర్శించి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కొత్తకోట మున్సిపల్ చైర్మన్ అరుణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ పి. పల్లవి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో ఇఫ్తార్ విందు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో ఉన్న మహబూబా జామే మజీద్ ఆవరణలో సోమవారం రాత్రి ఉపవాస దీక్షలున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. బాబా దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇస్తారు విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బచ్ ఫన్ ఆక్స్ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ లో ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ కార్నివల్ 2026

**జయభేరి, దేవరకొండ :**

బచ్పన్ఆక్స్ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ ఇంగ్లీష్ కార్నివాల్ 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరకొండ డిఎస్పి ఎంబి ఎం.వి శ్రీనివాసరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు డిఎస్పీ దేవరకొండ ఎం మాతృనాయక్ వారిని పాఠశాల యజమాన్యం శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేవరకొండ లాంటి ప్రాంతంలో ఇలాంటి స్కూల్లు నిర్మింపజేసి మంచి విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ గుద్దేటి జంగయ్య, ప్రిన్సిపాల్ బండారు నిశ్చల, చైర్మన్ ఇల్లందుల శ్రవణ్ కుమార్, డైరెక్టర్స్ పున్న వెంకటేశ్వర్లు, ఆలంపల్లి మురళి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 17 :**

సమగ్ర కార్యచరణ ప్రణాళిక 2025 26 సంవత్సరమునకు తెలంగాణ జిల్లా షెడ్యూలు కులాల సేవ సహకార అభివృద్ధి సంఘం కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా మండలముకు 190 యూనిట్లకు 382 లక్షలు మంజూరు కాబడినవని, అట్టి 190 యూనిట్ల కోసం తుర్కపల్లి మండలంలోని షెడ్యూలు కులాల లోన్ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లెంకల గీతారెడ్డి తెలిపారు. ఈనెల 17 నుండి 24 తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని పూర్తిచేసిన దరఖాస్తును అర్జీదారుడు డౌన్లోడ్ చేసుకుని సంబంధిత పత్రాలను జతపరిచి కార్యాలయంలో అందజేయాలని కోరారు. జత చేయవలసిన ధ్రువ పత్రాలు ఆన్లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రము, కులం ధ్రువీకరణ పత్రము, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, సోలార్ యూనిట్ కోసం బోరుబావిలో నీరు కలిగి ఉన్న ధ్రువీకరణ పత్రంకు సంబంధించిన గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా జార చేయబడిన పత్రం, పట్టాదారు పాస్ పుస్తకం సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో అందజేయాలన్నారు.

## హామీలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ

- **ఎమ్మార్వో రవికుమార్ కి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు.**



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 17 :**

హామీలకే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో రవికుమార్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులపై అనవసర ఆంక్షలు విధించడం అన్యాయమని అన్నారు. 22 ఏ జాబితాలో ఇండ్ల స్థలాలను చేర్చడం వల్ల సాధారణ ప్రజలు తమ ఆస్తులను వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ, సీనియర్ నాయకులు యట పెంటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు, ఆకుల రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లూ నర్సింహ యాదవ్, జిల్లా నాయకులు భానోత్ శత్రు నాయక్, దానబోయి సత్యనారాయణ, మోత్కుపల్లి బిక్షపతి, మండల ప్రధాన కార్యదర్శి భినారం కనకయ్య, ఎదుముళ్ళ ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు ఆకుల భాస్కర్, వార్డ్ మెంబర్ బత్తుల అనిల్, గుండెబోయిన మల్లేశం, ఎషబోయిన నాగరాజు, పరమేశ్, దీపక్ రెడ్డి, కసిరబోయిన గోపాల్, మహేందర్, బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్ గోగికార్ శ్రీను, బూత్ అధ్యక్షుడు తరణి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా దుస్తుల కిట్ల పంపిణీ

- **రంజాన్ పండగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలి: అయినాల చైతన్య మహేందర్ రెడ్డి.**



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 17 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లును ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో వారు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు చేయడం సంతోషకరమన్నారు. రంజాన్ పండగ సంతోషంగా జరుపుకునేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈరోజు వారికి రంజాన్ తోఫా కిట్లను అందచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచులు సోముల వెంకటేశం, బొత్త రాములు, నాయకులు ధోనికన వెంకటేష్ యాదవ్, బాలు యాదవ్, వార్డు సభ్యులు, ఆర్ ఐ జహంగీర్, సీనియర్ అసిస్టెంట్ సలీం, కార్యాలయ సిబ్బంది, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్ ను పర్యవేక్షించండి

- **విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోండి.**
- **హాస్పిటల్ సూపరిడెంట్ డాక్టర్ రవి ప్రకాష్ ను సస్పెండ్ చేయండి**
- **పేద ప్రజలకు సరైన వైద్యం అందించి న్యాయం చేయండి.**
- **సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్**



**జయభేరి, దేవరకొండ :**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ హాస్పిటల్ విషయంపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ,సిబ్బంది సరి అయినటువంటి సమయపాలన పాటించకపోవడం, సరైన మౌలిక సదుపాయాలు ఎండాకాల సమయంలో తాగునీరు లేకపోవడం డ్రెస్ కోడ్ పాటించకపోవడం, పేషెంట్లకు తగినట్టుగా వైద్యులు ఉన్నప్పటికీ వైద్యులు అందుబాటులో లేకపోవడం, డ్యూటీ డాక్టర్ కూడా సమయపాలన పాటించకపోవడం, వైద్య సిబ్బంది డాక్టర్లు, సూపరిడెంట్ డాక్టర్ రవి ప్రకాష్ కూడా దురుసుగా ప్రవర్తించడం వలన పేద ప్రజలకు సరైనటువంటి వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నారు. రక్త పరీక్ష ,ఎక్రే కొన్ని రకాలైనటువంటి పరీక్షలు చేసేటటువంటి వ్యక్తులు పేషంట్ల దగ్గర దురుసుగా ప్రవర్తిస్తూ మా దగ్గర పరీక్షలు లేవు మేము చేయలేము బయట ప్రవేట్ హాస్పిటల్ లో చేయించుకోమని దురుసుగా మాట్లాడటం జరుగుతుంది. థైరాయిడ్ సంబంధించి పరీక్షలు చేయకపోవడం మందులు ఇవ్వకపోవడం డెలివరీ సెక్షన్ లో నర్సులు ఆయాలు డబ్బులు వసూలు చేయడం ఎమర్జెన్సీ వార్డులలో కూడా పనిచేసేవారు డబ్బులు వసూలు చేయడం జరుగుతుంది. ENT డాక్టర్ లేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉంది. పేద ప్రజలకు సరైన వైద్యం అందించక ఇబ్బందులకు గురవుతున్నారు. హాస్పిటల్ ఒక మాయగా తయారయింది. ఇట్టి విషయంలో పై అధికారులు పర్యవేక్షించి పేద ప్రజలకు న్యాయం చేయాలి లేనియెడల పెద్ద ఎత్తున న్యాయం జరిగే వరకు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు ,పున్న వెంకటేష్ ,పున్న బిక్షమయ్య, భీమగోని శివగౌడ్ , పెరికేటి శ్రీనివాసాచారి, చిన్న గోని శ్రీనివాస్ గౌడ్, శివ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యారంగం సమస్యలపై వెంటనే రాష్ట్రం స్పందించాలి

- **రాష్ట్రంలోని విద్యారంగానికి కనీసం 15% బడ్జెట్ కేటాయించాలి**
- **ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్**

**జయభేరి, దేవరకొండ :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతు విద్యార్థుల సమస్యలపై ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రాబోయే మార్చి 20న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కావడం వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా ఎన్నికైన అమరవాదికి శుభాకాంక్షలు





**జయభేరి, చింతపల్లి :**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా ఎన్నికైన అమరవాది లక్ష్మీనారాయణ కి హృదయ పూర్వక శుభాకాంక్షలు. అమరవాది లక్ష్మీనారాయణ గెలుపు కొరకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు వందనపు ఆంజనేయులు చింతపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు.

## ఇబ్బందులు లేకుండా ఎల్పీజీ సరఫరా

**జయభేరి, దేవరకొండ :**



భారతీయ జనతా పార్టీ దేవరకొండ రూరల్ మండలం ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ మాట్లాడుతూ.. యుద్ధ వాతావరణంలో నూ ఎల్పీజీ గ్యాస్ సరఫరా తప్పుడు విమర్శలకు బీజేపీ సమాధానం ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న ఈ క్లిష్ట సమయంలో కూడా దేశ ప్రజలకు ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు తీసుకుంటోంది. భారతీయ జనతా పార్టీ హయాంలో ఇంధన భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి కుటుంబానికి గ్యాస్ అందుబాటులో ఉండేలా కృషి కొనసాగుతోంది. నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం అంతర్జాతీయ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటూ, అవసరమైన గ్యాస్ సరఫరా మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకుంది. దీనివల్ల ప్రజలకు ఎలాంటి కొరత లేకుండా సరఫరా జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం చేసినవే. ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోంది.

కానీ వాస్తవానికి బీజేపీ ప్రభుత్వం ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి చర్యలు తీసుకుంటోంది. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో ఇంధన రంగంలో స్థిరత్వం లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ప్రస్తుత బిజెపి ప్రభుత్వం సంక్షోభ సమయంలో కూడా ప్రజలపై భారం పడకుండా, సరఫరా వ్యవస్థను బలపరుస్తోంది. ప్రజలు నిజాలను గుర్తించి, కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను నమ్మకుండా దేశ అభివృద్ధికి తోడ్పడే విధానాలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, సముద్రాల సహదేవ్, కేలవత్ శంకర్, చండీశ్వర్, వజ్ర కుమార్, రెడ్డి శంకర్, అప్పం అజయ్, పున్న నాగరాజు, చిత్రం ఉదయ్, రాపోలు శ్రీను, కాసుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

**జయభేరి, దేవరకొండ :**





రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమలోకి వెళ్లిన విద్యార్థికి బచ్పన్ ఆక్స్ఫర్డ్ స్కూల్ నుండి ఆర్థిక సహాయం హోలీ పర్వదినం రోజున దేవరకొండ పట్టణానికి చెందిన 10వ తరగతి విద్యార్థి బైకు నడిపిస్తూ డివైడర్ కు తాకడం వలన తలకు తీవ గాయాలతో కోమాలోకి వెళ్లిన ఎం శ్రీనివాస చారి తండ్రి రవీంద్ర చారి ఆసుపత్రి ఖర్చులకోసం స్కూలు యాజమాన్యాన్ని సంప్రదించగా వెంటనే స్పందించిన పాఠశాల యాజమాన్యం విద్యార్థుల నుండి ఉపాధ్యాయుల నుండి మేనేజ్మెంట్ తరపున 32,000 పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థుల కుటుంబానికి అందించినారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ జంగయ్య ప్రిన్సిపాల్ నిశ్చల తెలియజేసినారు. డీఎస్పీ మాట్లాడుతూ.. 100 సంవత్సరాలు జీవితం ప్రాణంగా పెట్టి బైకులు వేగంగా నడపవద్దని మైనారిటీలకు బైకులు ఇవ్వడం చట్టరీత్యా నేరమని 18 సంవత్సరములలోపు విద్యార్థులకు బైకులు తల్లిదండ్రులు ఇవ్వవద్దని తెలియజేసినారు. ఆపదలో ఉన్న విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమని వారందరికీ అభినందలు స్కూల్ యాజమాన్యం తెలియజేసినారు.

## మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు

- **స్థలాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ యంపీ మధు యాష్కీ గౌడ్, మందముల పరమేశ్వర్ రెడ్డి**

**జయభేరి, ఉప్పల్, మర్చి 17:**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతన కార్యాలయ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.98 కోట్ల నిధులను మంజూరు చేయడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ నిర్ణయం జిల్లాలో పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నదిగా భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ కొత్త కార్పొరేషన్ కార్యాలయాన్ని అన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకోసం ఉప్పల్ భగయత్ ప్రాంతంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి. మంగళవారం ఈ స్థలాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ యంపీ, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సీనియర్ నాయకులు రాపోలు రాములు, బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, తదితరులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ.. మేడ్చల్ మల్కాజిగిరి అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన దృష్టి ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ అమలులోకి వస్తే పరిపాలన మరింత సమర్థవంతంగా మారి, ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి, టిపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్కి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం,ఈ ప్రాజెక్ట్ మేడ్చల్ జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం చేయడంతో పాటు,భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో GHMC మాజీ ఫ్లో లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మేడ్చల్, ఉప్పల్, ఎల్బీనగర్, మల్కాజ్గిరి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధుల, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ కార్మికులకు మెప్మా ఉద్యోగస్తులకు ఉచిత వైద్య శిబిరం



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు, మెప్మా సిబ్బందికి ప్రత్యేకంగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్ ,మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో వైద్యులు పారిశుద్ధ్య కార్మికులు మెప్మా సిబ్బందికి సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడానికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి శిబిరాలను తరచుగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. పట్టణాన్ని శుభ్రంగా ఉంచే వారికి ఆరోగ్యం కాపాడటం మనందరి బాధ్యత అని అధికారులు పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమం లో కౌన్సిలర్లు సాయి చంద్ర, అంకులమ్మ, సుమలత, రూప్ల నాయక్, నాయకులు పున్న వెంకటేశ్వర్లు, గుద్దేటి సత్యం, హెల్త్ డిపార్ట్మెంట్ డాక్టర్ విజయ, హెల్త్ సూపెర్వైసర్ సఫియా తబస్సుమ్, సిబ్బంది లతీఫ్, సంఘవి, సోనియా, అరుణ, లింగయ్య, విద్యావతి, మౌనిక, వాణి మునిసిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 17 :

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్ అన్నారు. మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో గ్రామపంచాయతీ కార్మికుల గౌరవాధ్యక్షుడు పల్లెపాటి లక్ష్మీనరసయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్ ను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మిక సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## టీచర్ గా మారిన సర్పంచ్

- టీచింగ్ చేస్తున్న సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్




జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 17 :

తుర్కపల్లి మండలం జేతురంతండ గ్రామంలో సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ తన గ్రామంలోని 10వ తరగతి పిల్లలకు పరీక్షలు దృష్టిలో ఉంచుకొని తనే స్వయంగా తండాలోని స్కూల్లో విద్య బోధన చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జామ్ దృష్టిలో పెట్టుకొని ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలని, సబ్జెక్టులోని డౌట్ లను తీరుస్తూ వారితో పాటు అక్కడే కూర్చొని విద్య యొక్క అవశ్యకతను తెలియజేస్తూ నేటి బాలలే రేపటి పౌరులు అని అన్నాడు.

# పోలీసుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

- గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం



జయభేరి, గజ్వేల్, మార్చి 17 :

గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99' కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా, సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు, ప్రజల రక్షణ సాధ్యమవుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పోలీసులకు రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రజలకు ఆరోగ్య పరంగా ఆర్థిక సహాయం

- ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్య పరంగా ఆర్థిక సహాయం అందించే దిశగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి ముందడుగు వేశారు

జయభేరి, ఉప్పల్ :

పేద కుటుంబానికి చెందిన బాధితురాలు ఉప్పల్ డివిజన్ భరత్ నగర్ కి చెందిన పల్లా అరుణ గారికి అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా రూ. 2 లక్షల విలువైన LOCను అందజేశారు. ఈ LOC ద్వారా హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స పొందే అవకాశం కల్పించారు. అలాగే ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరికీ CMRF చెక్కులను అందజేయడం జరిగింది. CMRF లోని LOC విధానం ద్వారా పేద రోగులకు ముందస్తు డబ్బు చెల్లించకుండా ఆసుపత్రుల్లో చికిత్స పొందే సౌకర్యం కల్పించబడుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైనప్పుడు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పేద ప్రజల ఆరోగ్య రక్షణే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు

ఎడ్లకు టీకాలు వేస్తున్న గ్రామ సర్పంచ్ కొండగల్ల గణేష్



జయభేరి, గజ్వేల్, మార్చి 17 :

పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయాలని తుంకి ఖాల్సా సర్పంచ్ కొండగల్ల గణేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని చేపడుతామని చెప్పారు. ప్రజాప్రతినిధులకు, పశుపోషకులకు సమాచారం ఇచ్చి చాటింపు చేయించి గ్రామాలకు ఉదయాన్నే వెళ్లి పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు . పశువులకు గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందని, ఈ వ్యాధి సోకిన పశువుల నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడి మేత మేయక, నడవలేక నీరసిస్తాయన్నారు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పడిపోతుందన్నారు. వ్యాధి సోకిన పశువులకు చికిత్స చేయకుంటే మరణిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా విద్యార్థులకు ఆర్థిక సహాయం

- కే ఎంపీ హెల్పింగ్ హాండ్స్ సేవలు అభినందనీయం సర్పంచ్ రమావత్ రాజు నాయక్



జయభేరి, కొండమల్లేపల్లి :

కేఎంపి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కేశ్యతండా సర్పంచ్ ఉమావత్ రాజు నాయక్ అన్నారు. మంగళవారం కే ఎం పీ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సోలిడార్ తెలంగాణ బదిరిల ఆశ్రమ పాఠశాల క్రీడా విద్యార్థులకు 20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఇటీవల ఆలిండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

ఈనెల 21 నుండి 23 వరకు గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరగనున్న జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొననున్నారు. విద్యార్థులలో ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు కావడంతో ఖర్చుల నిమిత్తం నిర్వాహకులు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సభ్యులను సంప్రదించారు. ఈ సందర్భంగా తమ వంతు సహాయంగా కే ఎంపీ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్వీకరించిన 20వేల రూపాయలను స్థానిక సర్పంచ్ రమావత్ రాజు నాయక్ చేతుల మీదుగా పాఠశాల నిర్వాహకులకు అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలకు, హెల్పింగ్ హాండ్స్ సంస్థకు నా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కె ఎం పి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము, కూన భానుచందర్,పి సైదులు, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, బొడ్డుపల్లి మల్లికార్జున్, పొగాకు మల్లేష్ ,డబ్బు శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వినోద్, సైదా నాయక్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బాపూజీనగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన చికెన్ సీజ్





జయభేరి, సికింద్రాబాద్, మర్చి 17:

సికింద్రాబాద్‌లో ఆహార భద్రతపై ఆందోళన కలిగించే ఘటన వెలుగులోకి వచ్చింది. బాపూజీనగర్ ప్రాంతంలో ఉన్న ఏ వన్ ఫ్రెష్ చికెన్ సెంటర్‌పై సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షాప్‌లో అక్రమంగా మరియు హైజీన్ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన చికెన్‌ను అధికారులు గుర్తించారు. సరైన పరిశుభ్రత పాటించకుండా నిల్వ చేసిన ఈ చికెన్ ప్రజల ఆరోగ్యానికి హానికరమని అధికారులు తెలిపారు. విచారణలో భాగంగా, ఈ చికెన్‌ను తక్కువ ధరలకు విక్రయిస్తూ నగరంలోని పలు బార్లు, రెస్టారెంట్లు మరియు వైన్ షాపుల అడ్డాలకు సరఫరా చేస్తున్నట్లు బయటపడింది. ఇది ఆహార భద్రతకు పెద్ద ముప్పుగా భావిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దాడి సందర్భంగా సుమారు 500 కిలోల చికెన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఈ చికెన్‌ను తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి అక్రమ చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని, తనిఖీలు మరింత కట్టుదిట్టం చేస్తామని అధికారులు హెచ్చరించారు. ప్రజలు కూడా ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో నాణ్యత, పరిశుభ్రత విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## తక్షణ న్యాయం చేయాలంటూ కేటీఆర్ కి వినతి

- పిజ్జాదిగూడ MRO ఆఫీస్ వెనుక డబల్ బెడ్‌రూమ్‌లో BC మహిళ కార్మికురాలి ఇంటి కబ్జా చేసిన మాజీ కార్పొరేటర్



జయభేరి, మేడిపల్లి, మర్చి 17:

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, పిజ్జాదిగూడ 10వ డివిజన్‌లో MRO ఆఫీస్ వెనుక ఉన్న డబల్ బెడ్‌రూమ్ ఇల్లు గతంలో కలెక్టర్, మేడిపల్లి MRO అధికారులు ఒక నిరుపేద BC మహిళ కార్మికురాలికి కేటాయించారు. అయితే అనారోగ్యం కారణంగా ఇంటికి తాళం వేసి వెళ్లిన సమయంలో, తిరిగి వచ్చి చూడగా (ఉత్తరప్రదేశ్) కి చెందిన వారు అక్రమంగా ఇంటిని ఆక్రమించుకున్నారు. తన ఇంటిపై హక్కు కోరిన మహిళపై దాడి చేసి, మాజీ కార్పొరేటర్ అండదండలతో బెదిరించి ఇంటి నుంచి బయటకు తోసేయడం జరిగింది. గత 6 నెలలుగా ఎమ్మార్వో, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ బాధితురాలికి న్యాయం జరగకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మహిళా సంఘాలు, కార్మిక సంఘాలు, హ్యూమన్ రైట్స్ సంస్థలతో కలిసి బాధితురాలికి అండగా నిలిచింది. BRS ప్రభుత్వంలో కేటాయించిన ఇల్లు గనుక ఈ విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా బాధితురాలికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో సంబంధిత మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి వినతులు అందజేస్తూ, "చలో పిజ్జాదిగూడ డబల్ బెడ్ రూమ్" (MRO ఆఫీస్ వెనుక) కార్యక్రమం చేపట్టనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అత్తినమోని నాగేష్ కుమార్ తెలిపారు.

# హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల డిజైన్లు పూర్తి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, పనుల డిజైనింగ్ ప్రక్రియ పూర్తయింది. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ సుందరీకరణ పనులకు సంబంధించి చెరువును ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిజైనింగ్ పనులను పర్యవేక్షిస్తున్న VIMOS ఏజెన్సీ ప్రతినిధి యూసుఫ్, శ్రీనాథ్ తో కలిసి చెరువును పరిశీలించారు. చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి ఉండడం వల్ల నాచారం ప్రాంత ప్రజలు దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చెరువులోని నీటిని ఖాళీ చేసి చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన ఏజెన్సీ బాధ్యులు చెరువులోని నీటిని తొలగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత 3040 సంవత్సరాలుగా ఈ చెరువును ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో చెరువు అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల హెచ్‌ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బారాసా రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

